గౌరవనీయ న్యాయమూర్తి శ్రీ.ఆర్.సుభాష్ రెడ్డి

మరియు

గౌరవనీయ న్యాయమూర్తి శ్రీ. బి.శివ శంకర్ రావు

ఎఫ్.సి.ఎ.నెంబరు.47/2015

**తీర్పు**:(గౌరవ న్యాయమూర్తి శ్రీ ఆర్.సుభాష్ రెడ్డి ద్వారా వెలువరించబడినది)

ఫ్యామిలీ కోర్టు, హైదరాబాద్ వారు, ఎఫ్.సి.ఓ.పి.నెం.1583/2013లో 18/07/2014నాడు వెలువరించిన ఉత్తర్వు మరియు డిక్రీ వలన వ్యధ చెందిన అప్పీలుదారు కుటుంబ న్యాయస్థానాల చట్టం, 1984లోని సెక్షన్ 19 క్రింద ఈ అప్పీలును దాఖలు చేసెను. తేది. 04-06-1998 నాడు కక్షిదారుల మధ్య జరిగిన వివాహమును రద్దు చేసి, విడాకుల డిక్రీని మంజూరు చేయవలెనని, హిందూ వివాహ చట్టము 1955లోని సెక్షన్ 13 (1) (ఐఏ) మరియు 26 క్రింద ప్రతివాది వేసిన పిటిషనను ఫ్యామిలీ కోర్టు, హైదరాబాద్ వారు ఆమోదించిరి.

2. దీనిలో అప్పీలుదారు, ప్రతివాది, ఎఫ్.సి.ఓ.పి. నెం.1583/2013 కేసులో ప్రతివాది మరియు పిటిషనరుగా ఉన్నారు. అనుకూలత కొరకు ఈ అప్పీలులోని కక్షిదారులు దిగువ కోర్టులోని ఓ.పి.లో వారిని చూపిన వరుస క్రమములోనే సూచించబడిరి.

3. పిటిషనరు-భర్త పైన చెప్పిన ఎఫ్.సి.ఓ.పి.ని ప్రతివాది-భార్యపై అనేక ఆరోపణలతో దాఖలు చేసి, వివాహము రద్దు చేయమనియూ, వారి కుమారుడు ఎస్.పరమేష్ ను తనకు అప్పగించాలనియు కోరెను. నోటీసు అందుకొనిన తరువాత, ప్రతివాది-భార్య కోర్టులో హాజరు కానందున ఆమెను ఎక్స్ పార్టీగా చేసిరి. పిటిషనరు-భర్త పి.డబ్ల్యు-1

యొక్క రుజువు-సాక్ష్యమును రికార్డు చేసి, డాక్యుమెంట్లను ఎగ్జిబిట్స్ పి.1 నుండి పి.3 వరకు గుర్తించిన తరువాత, తేది. 18-07-2014 నాడు కక్షిదారుల వివాహమును రద్దు చేస్తూ, విడాకుల డిక్రీని వివాదాస్పద ఉత్తర్వు ద్వారా మంజూరు చేసెను. కానీ కుమారుని అప్పగించాలని ఒత్తిడి లేనందున అట్టి విన్నపమును కొట్టివేసెను. దాని వలననే వ్యధితులైనందున, ప్రస్తుత అప్పీలు దాఖలైనది.

4. కక్షిదారుల తరపున గల న్యాయవాదులు చెప్పినది విన్నాము. వారి అభ్యర్ధన మేరకు అప్పీలును ప్రారంభ దశలోనే పరిష్కరించితిమి.

5. వివాదాస్పద ఉత్తర్వును పరిశీలించినచో, ప్రతివాది-భార్య యొక్క క్రూరత్వమును కారణముగా చూపి, వివాహము రద్దు చేయాలని పైన చెప్పిన ఓ.పి.ని. దాఖలు చెసెనని తెలియుచున్నది.పి.డబ్ల్యు-1 గా పిటిషనర్-భర్తను తెలుపుతూ, ఎగ్జిబిట్స్ పి.1 నుండి పి.3 వరకు గుర్తించుట మినహా ప్రతివాది-భార్యపై ఆరోపించిన క్రూరత్వమును గుర్తించినట్లుగా ఎలాంటి రికార్డును దిగువ కోర్టు చూపలేదు. ప్రతివాది-భార్య కోర్టులో హాజరు కానందున ఎక్స్-పార్టీగా చేసినప్పటికీ, ప్రతివాది-భార్య క్రూరత్వము గూర్చి చేసిన ఆరోపణ విషయమును పరిశీలించి రికార్డు చేయవలసిన బాధ్యతను దిగువ కోర్టు నిర్వర్తించవలెను. రికార్డు చేయబడిన అభ్యర్ధనలపై మరియు రుజువుల పై ఆధారపడి క్రూరత్వము గూర్చి చేసిన ఆరోపణనను ప్రత్యేకముగా పరిశీలించి, రికార్డు చేస్తేనే తప్ప, సి.పి.సి.లోని ఆర్డర్ XX, సెక్షన్ 2(9) క్రింద వివాదాస్పద ఉత్తర్వు, ఆ ప్రకారమే ఉన్నదని అన్వయించలేము.

6. పైన చెప్పిన కారణముల వలన తేది. 18-07-2014నాడు ఇచ్చిన ఉత్తర్వు కొట్టివేయబడెను. తాజా పరిశీలన కొరకు కేసును దిగువ కోర్టుకు త్రిప్పి పంపుచూ, చట్టరీత్యా తగిన ఉత్తర్వులు జారీ చేయమని ఆదేశించడమైనది. ప్రతివాది-భార్య ప్రతి ప్రమాణ

పత్రమును దాఖలు చేయుటకును, ఆమె తరపున సాక్ష్యాధారాలను ప్రవేశ పెట్టుటకును అనుమతించబడెను. ఓ.పి. 2013వ సంవత్సరమునకు సంబంధించినది కాబట్టి ఓ.పి.ని. వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఈ రోజు నుండి 8 నెలల సమయములోపల పరిష్కరించాలని, దిగువ కోర్టుకు ఆదేశించడమైనది.

7. పైన తెలిపిన ఆదేశాల ప్రకారము ఈ అప్పీలు పరిష్కరించబడెను.ఏవైనా ఇతర పిటిషన్లు పెండింగులో ఉన్నట్లైతే అవి కూడా ముగించబడతాయి. ఖర్చులకు సంబంధించి ఎలాంటి ఉత్తర్వు లేదు.

___________________________

న్యాయమూర్తి, ఆర్.సుభాష్ రెడ్డి

___________________________

న్యాయమూర్తి, డా. బి.శివ శంకర రావు

తేదీ.25.02.2015.